
ఉత్పత్తులను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

చేనేతకారులకు ప్రభుత్వం చేయూత

● మంత్రి సీతక్క

బంజారాహిల్స్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం చేనేతకళాకారులకు చేయూత అందిస్తూ వారి అభ్యున్నతికి తోడ్పడుతుందని, దేశంలోని ప్రముఖ రాష్ట్రాలకు చెందిన చేనేతకారుల ఉత్పత్తులకు ఒక వేదికగా చేర్చి వినియోగదారులకు అందించడం మంచి విషయమని మంత్రి సీతక్క అన్నారు. శ్రీనగర్కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటు చేసిన సిల్క్ ఎగ్జిబిషన్‌ను గురువారం ఆమె ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో కలిసి సందర్శించారు. ఇక్కడి చీరలు చాలా అందంగా ఆకట్టుకునేలా ఉన్నాయని, చేనేతకారుల ఉత్పత్తులను తిలకించి అభినంది పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులను సుమారు 70 స్టాళ్లలో ఏర్పాటు చేశామని సిల్క్ ఇండియా సీఈఓ వినయ్ కుమర్ తెలిపారు. ఉగాదితో పాటు పలు శుభకార్యాలకు అనువుగా పోచంపల్లి, మదనపల్లి, గద్వాల, వెంకటగిరి, చెందేరి, ఇక్కత్, నానాయన్‌పేట, బెనారస్, కోల్‌కతాతో పాటు పలు నగరాలకు చెందిన విభిన్నమైన. అరుదైన చీరలను స్టాల్స్‌లో ఏర్పాటు చేశామని, ఈ నెల 16 వరకూ ఈ ఎగ్జిబిషన్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందన్నారు.


అభివాదం చేస్తున్న ఎంపీ బలరాం నాయక్, మాజీ మంత్రి రవీంద్ర నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, తదితరులు

రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా బీజేపీ విధానాలు

పంజాగుట్ట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడిచే ప్రయత్నం చేస్తోందని, పది సంవత్సరాల్లో అనేక సవరణలు, బిల్లులు తెచ్చిందని వక్తలు ఆరోపించారు. రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా ఆ పార్టీ విధానాలు ఉన్నాయని, రాజ్యాంగ రక్షణకై మరో పోరాటానికి సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. గిరిజన శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్ చౌహాన్ అధ్యక్షతన గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కేంద్ర ప్రభుత్వ విధానాలు- ప్రమాదంలో రాజ్యాంగం, సంక్షోభంలో ప్రజాస్వామ్యం అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పి.బలరాం నాయక్, మాజీ మంత్రి రవీంద్ర నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, పౌర హక్కుల ఉద్యమకారులు ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, మాల జన సమితి రాష్ట్ర అధ్యక్షులు మందాల భాస్కర్, మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పిడమర్తి రవి, తదితరులు పాల్గొని మాట్లాడారు. ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా బీజేపీ విధానాలు ఉన్నాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజల మధ్య చిచ్చుపెట్టి ఐక్యతను దెబ్బతీసే కుట్ర ఆర్ఎస్ఎస్ ద్వారా చేస్తుందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునే బాధ్యత పౌర సమాజంపై ఉందని అన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న సెట్విన్ శిక్షణ కోఆర్డినేటర్ పారిజాతం

మహిళలు ఉపాధి రంగాల్లో రాణించాలి

● కేవీఐసీ డైరెక్టర్ ఎంఎన్ సుధాకర్

యూసుఫ్‌గూడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ఉపాధి రంగాలను ఎంచుకొని వాటిలో రాణించాలని ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవీఐసీ) డైరెక్టర్ ఎంఎన్ సుధాకర్ అన్నారు. కేవీఐసీ, యూసుఫ్‌గూడ, సెట్విన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి 27 నుంచి మార్చి 13 వరకు మహిళలకు టైలరింగ్‌లో 15 రోజులుగా ఉచిత శిక్షణ ఇచ్చారు. సెట్విన్‌లో జరిగిన ముగింపు కార్యక్రమం సందర్భంగా మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఎంఎన్ సుధాకర్ మాట్లాడుతు తెలంగాణలో 12 జిల్లాల నుంచి మహిళలకు ఉచిత వసతి కల్పించి, టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో కేవీఐసీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ లంక మనోజ్, డీజీపీ అసిస్టెంట్ డైరెక్టర్ శర్మ, సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాల్‌రావు, సెట్విన్ ట్రయినింగ్ కోఆర్డినేటర్ ఆరుట్ల పారిజాతం, పలువురు లత, దేవి తదితరులు పాల్గొన్నారు.

వివాహం జరిగిన ఇంట్లో చోరీ

బోరబండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పెళ్లిచేసి ఇంటికి వచ్చేసరికి ఇంట్లో దాచిన బంగారంతో పాటు నగదు చోరీకి గురైన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం... బోరబండ బలహీనవర్గాల కాలనీలో నివసించే వెంకట్ తన కూతురి వివాహాన్ని సైట్-3 ఆచార్య కె.జయశంకర్ కమ్యూనిటీహాల్‌లో బుధవారం జరిపించాడు. వివాహం అనంతరం ఇంటికి వెళ్లగా ఇంటి తాళాలు పగలగొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూస్తే అల్మారాలో దాచిన రూ.95 వేలు, 12 గ్రాముల బంగారు నగలు కనిపించలేదు. బాధితుడు వెంకట్ బోరబండ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం రాత్రి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న బోరబండ నేరపరిశోధక విభాగం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దాడి కేసులో ముగ్గురి హిజ్రాల అరెస్ట్

మోతీనగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హోలీ సందర్భంగా డబ్బులు అడగగా ఇవ్వలేదన్న కోపంతో రెస్టారెంట్ యజమానిపై దాడి చేసి గాయపరిచిన కేసులో ముగ్గురు హిజ్రాలను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. మాదాపూర్ 100 ఫీట్ రోడ్‌లోని ఓ రెస్టారెంట్ వద్దకు ఈ నెల నాలుగో తేదీన ముగ్గురు హిజ్రాలు చేరుకున్నారు. హోలీ సందర్భంగా రూ.2000 రూపాయలు డబ్బులు ఇవ్వాలని రెస్టారెంట్ యజమాని రాఘవేంద్రరావును డిమాండ్ చేశారు. అందుకు ఆయన నిరాకరించడంతో హిజ్రాలు ఐరన్ డస్ట్ బిన్‌ను రాఘవేంద్రరావుపై విసిరి వేశారు. ఈ దాడిలో రాఘవేందర్‌రావు ముక్కుకు తీవ్ర గాయమైంది. దీంతో ఆయనను హైటెక్ సిటీ సమీపంలో ప్రవేటు వైద్యశాలు తరలించారు. ఈ విషయమై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయగా దాడి చేసిన హిజ్రాలైన అరుజు అలియాస్ షేక్ హుస్సేన్, అధాకాన్ అలియాస్ అబ్దుల్ సాదిక్, నేహా అలియాస్ నీలేష్ ఆనంద్ కాడే వీరిని గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సినీ దర్శకుడిని అడ్డుకొని దాడి

బంజారాహిల్స్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళుతున్న సినీ దర్శకుడిని అడ్డుకొని దాడి చేసిన వారిపై కేసు నమోదయింది. జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 5లో నివసించే ఎస్. మిర్జాపురం అశోక్ తేజ సినీ దర్శకుడు. మాదాపూర్‌లోని ఓ యాడ్ షూటింగ్ నిమిత్తం డిస్కషన్ కోసం వెళ్లారు. అనంతరం ఇంటికి వెళ్లేందుకు జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 10 మీదుగా ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు. వెనుక నుంచి నలుగురు వ్యక్తులు రెండు వాహనాలపై అతి వేగంగా వెళ్లారు. ఈ విషయం ప్రశ్నించినందుకు నలుగురు కలిసి అశోక్‌తేజపై దాడి చేశారు. దుర్భాషలాడుతూ దౌర్జన్యం చేసి అక్కడి నుంచి పారిపోయారు. అశోక్‌తేజ ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హోలీ.. రంగోలి



ఆనందం, ఆధ్యాత్మికం కలగలిసిన వేడుక ● హిల్స్‌లో కులమతాలకతీతంగా సంబరాలు

బంజారాహిల్స్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): "బురా మత్ మానో... హోలీ హై" అంటూ ఒకరికొకరు రంగులు పులుముకుంటారు. ఆధ్యాత్మికం, సంప్రదాయం, కొత్త పరిచయాలు, స్నేహాలు, బంధుత్వాలను దృఢ పరిచే హోలీని నగర వాసులు ఘనంగా నిర్వహించుకుంటారు. హోలీ జరుపుకునేందుకు అనేక కథలను పురాణాలు చెబుతున్నాయి. నగరంలో ఉన్న వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజలు హోలీని వివిధ రకరకాలు చేసుకుంటూ నగరాన్ని రంగవల్లిగా మారుస్తారు.

మనుషుల మధ్య దూరం మాయం..

నరంగలో కులమతాలకతీతంగా ఈ పండుగను నిర్వహించుకుంటారు. రెండు రోజుల ముందు నుంచే వేడుకలు మొదలవుతాయి. బంధుత్వం దృఢం కావాలని నగర వాసులు హోలీ నిర్వహించుకుంటారు. ఇతర మతస్థులు భాగస్వాములై రంగులు పులుముకుంటూ సంబరాలను చేసుకుంటారు. చిన్న చిన్న తప్పిదాల కారణంగా దూరమైన వారు కూడా అన్ని మరిచిపోయి వేడుకలో పాల్గొంటారు.

భిన్న సంస్కృతుల సమ్మేళనం...

నగరంలో భిన్న సంస్కృతులు, వివిధ రాష్ట్రాలకు చెందిన వారు నివసిస్తున్నారు. బేగంబజార్, సిద్ది అంబర్‌బజార్‌లో ఉంటున్న రాజస్థానీలు కాముని దహానానికి పెద్ద పీట వేస్తారు. హోలీ ముందు కర్రలు, పిడకలు, నెయ్యితో కామ దహనం ఏర్పాటు చేస్తారు. రాజస్థాని పండిత్‌ల మంత్రోచ్ఛరణల మధ్య కాముడి చుట్టు ప్రదక్షణలు చేసి కామ దాహనం నిర్వహిస్తారు.



హోలీ ఆడేందుకు తెల్లటి వస్త్రాలను ధరించడం రాజస్థానీల సంప్రదాయం. హోలీకి శివుడిని ఆరాదించి బంగును ప్రసాదంగా తీసుకుంటారు. నగరంలో దీనిపై నిషేధం ఉండటంతో రాజస్థాన్ నుంచి తెప్పించి స్వీటుతో పాటు స్వీకరిస్తారు. సికింద్రాబాద్‌లో ఉండే సింధులు ఐదురోజుల పాటు వేడుకలు నిర్వహించుకుంటారు. కుటుంబాలకు పరిమితం కాకుండా స్నేహితులతో సందడి చేస్తారు. బీహారీలు రెండు రోజుల పాటు వేడుకలు నిర్వహించుకుంటారు. ఇందులో భాగంగా ప్రత్యేకంగా ఉట్టిలను కొడతారు. ఇలాంటి సంస్కృతి బంజారాహిల్స్ ప్రాంతంలో కనిపిస్తుంది.

కార్పొరేట్ హంగు వేరు...

నగరంలో కార్పొరేట్ రంగం హోలీ వేడుకలను వినూత్నంగా నిర్వహించుకుంటూ ఉంటారు. బంజారాహిల్స్ జూబ్లీహిల్స్ లాంటి ప్రాంతాల వాసులు ఓ బృందంగా మారి వేడుకలను ఉత్సాహభరితంగా చేసుకుంటారు. పది కుటుంబాలు కలిసి ఓకే దగ్గర చేసి వేడుకలు నిర్వహించుకుంటారు. యువత రెయిన్ డ్యాన్స్ కోసం ప్రత్యేకంగా పైప్‌లైన్ ఏర్పాటు చేయించుకుంటారు.

దక్షిణాది రుచులు...

హోలీ అనగానే రంగులే కాదు దక్షిణాది రుచులు నోరిరుస్తుంటాయి. పండుగ కావడంతో ఇళ్లలో సంప్రదాయ పిండి వంటలు చేసుకుంటారు. అయితే కోల్‌కత్తా రుచులు గ్రీసీ కచోరాస్, దాహి బల్లాస్ భోజన ప్రియులను నోరిస్తుంటాయి. అంతే కాకుండా దక్షిణాది మిఠాయిలు రసగుల్లా, రసమల్లై, చుమ్ చుమ్ వంటి స్వీట్ల మంచి డిమాండ్ ఏర్పడుతుంది. జొన్నలు, బెల్లం, కొబ్బరితో చేసే గుజియాలు హోలీ ప్రత్యేక వంటకం. రెస్టారెంట్‌లు ఈ రుచిని ప్రత్యేకంగా సిద్దం చేసి వడ్డిస్తాయి. వివిధ రకాల వంటకాలు అదనపు ఆకర్షణగా ఉంటాయి.

హోలీ రే రంగ హోలీ..

బంజారాహిల్స్ అనగానే ధనవంతులు ఆ తరువాత గుర్తుకువచ్చేది లంబాడీలు. వెంకటేశ్వరనగర్, బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12లో నివసించే గిరిజనులు హోలీని విభిన్నంగా నిర్వహించుకుంటారు. హోలీకి ముందు రోజు ఆరాధ్య దైవ సిట్ల మాతకు పూజలు నిర్వహిస్తారు. అనంతరం సంప్రాదాయ దుస్తుల్లో నృత్యాలు చేస్తూ రంగులు పులుముకుంటారు. బంధువుల ఇళ్లలకు కుటుంబ సపరివార సమేతంగా వెళ్లి రంగులు పోసుకుంటారు. మగవారు తలపాగా తప్పనిసరిగా దరిస్తారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటాం

● మాలలకు జరుగుతున్న అన్యాయంపై మాల ఎమ్మెల్యేలు అసెంబ్లీలో గళం విప్పాలి

● మంద కృష్ణ మాదిగ నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారు


అభివాదం చేస్తున్న మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెన్నయ్య, వెంకటేశ్వర్లు, శ్రీధర్ రావు, రమేష్, నాను, తదితరులు

పంజాగుట్ట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటామని, మాలలకు జరుగుతున్న అన్యాయంపై మాల ఎమ్మెల్యేలు అసెంబ్లీలో గళం విప్పాలని మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య డిమాండ్ చేశారు. మంద కృష్ణ మాదిగ నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ కో చైర్మన్‌లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్, మన్నె శ్రీధర్ రావు, జంగా శ్రీనివాస్, నానులతో కలిసి ఆయన మాట్లాడుతూ తప్పుల తడకగా ఉన్న జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ రిపోర్టును శాసనసభలో మాల సామాజిక వర్గం ఎమ్మెల్యేలు ఎండగట్టాలని, మాలలకు, ఉప కులాలకు జరిగే అన్యాయాన్ని ప్రశ్నించాలని అన్నారు. వారు మాట్లాడక పోతే వారి ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా ఎంపరీకల్ డేటా లేకుండా కులాల వారీగా గ్రూపులుగా విభజించిన విధానం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. మంద కృష్ణ మాదిగ నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నాడని ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చి రిజల్ట్ విడుదల చేసిన తరువాత వాటిలో మార్పు చేయడం కుదరదని ఆయనకు తెలియదా అని ప్రశ్నించారు. ఆయన పక్కన ఉండి మాట్లాడే వారికి తెలంగాణ నిరుద్యోగుల పరిస్థితి తెలియదా అని అన్నారు. బీజేపీ మెప్పుకోసం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకు తెలంగాణ నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవద్దని సూచించారు.ఉద్యోగ నియామకాలు ఆపడానికి ఆయన ఎవరని అన్నారు. ఆయనకు చేతనైతే బీజేపీతో కొట్లాడి కేంద్రంలో బిల్లు పెట్టించి దేశవ్యాప్త వర్గీకరణ చేయించాలని అన్నారు. మాలలకు అన్యాయం జరుగుతుంటే మాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఎందుకు మాట్లాడడం లేదని అన్నారు. తాము ఎక్కడ అభివృద్ధి చెందామో చూపించాలని అన్నారు.

ఎమ్మెల్సీలు కూడా మండలిలో లేవనెత్తాలని, జాతి ద్రోహులుగా మిగిలిపోవద్దని అన్నారు. వర్గీకరణ ఆపలేరని అంటున్నారని, తాము ఆపి చూపిస్తామని అన్నారు. సమావేశంలో నాయకులు సత్యనారాయణ, తాలూకా రాజేష్, సరళ, రమ, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కుటుంబ నిర్వహణలో మహిళలే ఆర్థికవేత్తలు

● చింతల రామచంద్రారెడ్డి

బంజారాహిల్స్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కుటుంబ నిర్వహణలో మహిళలే ఆర్థిక వేత్తలని, వచ్చిన సంపాదనను సర్దుబాటు చేయడంలో వారికి మించిన వారు లేరని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సాగర్ సొసైటీలోని క్యాంపు కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతూ స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. ప్రధాని మోదీ మహిళలను ప్రోత్సహించేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమారి, బంగారు శృతి, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షులు డా.గౌతమ్ రావు, బీజేపీ రాష్ట్ర నేతలు మేచినేని శ్రీనివాస్, పల్లె వీణారెడ్డి, మహిళా మోర్చా నాయకురాలు, సుభాషిణీ, కొత్త నీరజ, కృష్ణవేణి, మాధవి, అనురాధ, వీణామాధురి తదితరులు పాల్గొన్నారు.


ఖైరతాబాద్ బడా గణేష్ ప్రాంగణంలో కాముని దహనం

గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కాముని దహనం

ఖైరతాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హోలీ సంబరాలకు అంకురార్పణ చేస్తూ గురువారం పలు ప్రాంతాల్లో కాముని దహన కార్యక్రమాలు జరిగాయి. ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎప్పటిమాదిరిగానే ఈ సంవత్సరం భారీ గణపతి ప్రాంగణంలో కాముని దహనం శాస్త్రోక్తంగా జరిగింది. పెద్ద ఎత్తున రాజస్థానీ, మార్వాడీ మహిళలు కాముడికి పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ కన్వీనర్ సందీప్రాజ్, చైర్మన్ సింగరి రాజ్ కుమార్ పూజలు చేసి కాముని దహనం చేయించారు. దీనిని చూసేందుకు ఎంతోమంది ఇక్కడకు రావడంతో సందడి కనిపించింది. పెద్ద ఎత్తున మంటలు లేవడంతో ఆ మార్గంలో ప్రయాణికులను అనుమతించలేదు. కాముని దహనం కాగానే ఉత్సవ సమితి హోలీ వేడుకలను ప్రారంభించి ఒకరికొకరు రంగులు చల్లుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నేడు ప్రజావాణికి సెలవు

బేగంపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హోలీ పండుగ సందర్భంగా నేడు (శుక్రవారం) ప్రజాభవన్‌లోని ప్రజావాణి కార్యక్రమానికి సెలవు ప్రకటించినట్లు ప్రజావాణి అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి 14వ తేదీన కాకుండా ఈనెల 18వ తేదీన ప్రజాభవన్‌లో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కావాలని ప్రజావాణి ఇన్‌చార్జి డా.చిన్నారెడ్డి తెలిపారు.


అపోలో మెడికల్ కాలేజీలో పిల్లల గుండె వైద్య శిబిరంలో స్క్రీనింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

అపోలోలో పిల్లల గుండె వైద్య శిబిరం

హైదరాబాద్ సిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లోని అపోలో మెడికల్ కాలేజ్ ఆస్పత్రి ఆవరణలో పిల్లల గుండె వ్యాధుల ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గురువారం ప్రారంభించారు. అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఆస్పత్రి (ఏఐఎంఎస్ఆర్), హైదరాబాద్ జిల్లా రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కె) ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించారు. పిల్లల్లో పుట్టుకతో వచ్చే వైకల్యాలకు తగిన చికిత్స అందించడం రాష్ట్రీయ బాల్ స్వస్థ్య లక్ష్యమని కలెక్టర్ చెప్పారు. ఈ శిబిరంలో స్క్రీనింగ్ నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సహాయం చేస్తున్నారని చెప్పారు. ఏఐఎంఎస్ఆర్ సీవోవో అపర్ణా రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాలు, అణగారిన వర్గాలకు చెందిన పిల్లలు, అనాథలకు సేవలందిస్తున్నామని, గత రెండేళ్లలో 800 పైగా పిల్లలకు ఉచితంగా చికిత్స చేశామని తెలిపారు. డీన్ డాక్టర్ కే మనోహర్, ఆస్పత్రి వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

తలసీమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం

ఖైరతాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తలసీమియా బాధితుల కోసం కేఫ్ నీలోఫర్, తలసీమియా సికిల్ సెల్ సొసైటీ (టీఎస్‌సీఎస్)ల సంయుక్త ఆధ్వర్యంలో లక్డీకాపూల్‌లోని కేఫ్ నీలోఫర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో దాదాపు 101 యూనిట్ల రక్తాన్ని సేకరించి తలసీమియా బాధితులకోసం అందజేశారు. ఇందులో టీఎస్‌సీఎస్ అధ్యక్షుడు డాక్టర్ చంద్రకాంత్, జాయింట్ సెక్రటరీ ఎంఎ అలీమ్ బేగ్, కేఫ్ నీలోఫర్ యజమాని, మేనేజర్ శశాంక్ అనుముల, టీఎస్‌సీఎస్ బోర్డు సభ్యుడు మహమ్మద్ అమీన్ తదితరులు హాజరై తలసీమియాతో బాధపడుతున్న వారికి తరచుగా రక్తం అవసరమని అలాంటి వారికోసం రక్తదానం చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు.


నిమ్స్‌కు వీల్ చైర్లను అందిస్తున్న దృశ్యం

నిమ్స్‌కు 20 వీల్‌చైర్ల వితరణ

హైదరాబాద్ సిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నిమ్స్‌కు 20 వీల్ చైర్లను నల్గొండకు చెందిన రాఘవేంద్ర రెడ్డి గురువారం ఆస్పత్రి అడిషనల్ మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ లక్ష్మి భాస్కర్‌కు అందచేశారు. తన తల్లి జయప్రదకి గతంలో మెరుగైన వైద్యం అందిన కారణంగా తనవంతు సహాయంగా నిమ్స్‌కు వచ్చే రోగుల సౌలభ్యం కోసం వీల్ చైర్లను అందించినట్లు చెప్పారు.

మతపరమైన రాజకీయాలను ఖండిస్తున్నాం

● బీసీ ముస్లిం సంఘాల జేఏసీ


సమావేశంలో పాల్గొన్న బీసీ ముస్లిం సంఘాల జేఏసీ నాయకులు

పంజాగుట్ట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లపై తీర్మానం చేయాలని బీసీ ముస్లిం సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. మత పరమైన విభజన రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తున్నామని జేఏసీ నాయకులు అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ, వివిధ సంఘాల నాయకులు అద్నాన్ కమర్, శుక్రుద్దీన్, షేర్‌అలీ, మహమ్మద్ షబ్బీర్, ముజాహెద్, ఫరీద్, పాషా, షేక్ బాషా, తదితరులు మాట్లాడారు. కులగణన ద్వారా బీసీల లెక్కలు తీయడం, రిజర్వేషన్లు కల్పించాలను కోవడం చరిత్రాత్మక నిర్ణయం అన్నారు. బీసీలను మత కోణంలో విభజించడం ద్వారా రిజర్వేషన్లు అమలు చేయాలనే ఉద్దేశం కన్నా బీసీలలో గందరగోళం సృష్టించడం, న్యాయస్థానాలలో అడ్డంకులు ఎదురు అవ్వాలనే ఆలోచన కనిపిస్తోందని అన్నారు. రాష్ట్రంలో బీసీలు 56 శాతం ఉంటే సీఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్ సమావేశంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఏ ప్రాతిపదికన ఆమోదించారని అన్నారు. కులగణనలో హిందూ బీసీలు 46 శాతం, ముస్లిం బీసీలు పది శాతం ఉన్నారని ఎలా విభజిస్తారని ప్రశ్నించారు. బీజేపీ బీసీ రిజర్వేషన్లలో ముస్లింలు ఎందుకు అని ప్రశ్నించడంతో రాష్ట్ర ప్రభుత్వం తమను ఎందుకు మినహాయిస్తుందని అన్నారు. మత పరమైన రిజర్వేషన్లు కల్పించాలని చూస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని అన్నారు. తమకు ఒక్క కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వలేదని, మూడు వేల కోట్ల రూపాయల బడ్జెట్ ప్రకటించి ఒక్క రూపాయి కూడా సబ్సిడీ రుణాలు ఇవ్వలేదని అన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం ఐక్య కార్యాచరణ ప్రణాళిక రూపొంది రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని అన్నారు. ముస్లిం నాయకులు పార్టీల జెండాలు పక్కన పెట్టి తమతో కలిసి రావాలని, లేకపోతే వారికి బుద్ధి చెప్పుతామని అన్నారు.

బస్తీ దవాఖానాకు వైద్యుడి నియామకం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రెజిమెంటల్‌బజార్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మోండా డివిజన్ సాంబమూర్తినగర్‌లోని బస్తీ దవాఖానాలో వైద్యుడు లేక పోవడంతో రోగులు అవస్థలు పడుతున్న విషయంపై 'బస్తీ దవాఖానాలో వైద్యుడు కరువు' అనే శీర్షికతో ఈనెల 4న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. హైదరాబాద్ జిల్లా డీఎంహెచ్‌ఓ సాంబమూర్తినగర్‌లోని బస్తీ దవాఖానాకు వైద్యుడిని నియమించారు. నాలుగు నెలలుగా వైద్యుడి పోస్టు ఖాళీగా ఉన్న విషయాన్ని వెలుగులోకి తెచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఆంధ్రజ్యోతికి ఈ సందర్భంగా స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేశవరెడ్డి

కనుల పండువగా వీరాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

సికింద్రాబాద్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ 2వ వార్డులోని అన్నానగర్ పంచముఖ వీరాంజనేయస్వామి దేవస్థానం రెండో వార్షికోత్సవ వేడుకలు గురువారం కనుల పండువగా జరిగాయి. అన్నానగర్, అర్జున్‌నగర్, శ్రీలం కబస్తీ, బాలంరాయి, ఇందిరమ్మనగర్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరై పూజలు చేశారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు సాద కేశవరెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని కేశవరెడ్డి ప్రారంభించారు.


వారాసిగూడలో నిరసన వ్యక్తం చేస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

'పద్మశాలీలకు సీఎం క్షమాపణ చెప్పాలి'

బౌద్ధనగర్, మార్చి13(ఆంధ్రజ్యోతి): పద్మశాలీ కులస్థులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని పద్మశాలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గ్రేటర్ వారాసిగూడ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు బొమ్మ నరేందర్ ఆధ్వర్యంలో గురువారం సంఘం కార్యాలయంలో వారు నిరసన వ్యక్తం చేశారు. చేనేత మగ్గానికి పసుపు నీళ్ల, పాలతో శుద్ధి చేశారు. అనంతరం చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాస్ మాట్లాడుతూ, పద్మశాలీలు, చేనేత కార్మికులు మార్కేండయ స్వామితో సమానంగా భావించే చేనేత మగ్గంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బూట్లతో కూర్చుని అపవిత్రం చేశారని అన్నారు. పద్మశాలీలకు ముఖ్యమంత్రి వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గీత, సుమలత, సుజాత తదితరులు పాల్గొన్నారు.


నూతన కమిటీ సభ్యులను సత్కరించిన మదన్‌మోహన్ తదితరులు

'సికింద్రాబాద్' విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం నూతన కమిటీ నియామకం

బౌద్ధనగర్, మార్చి13(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం అధ్యక్షుడిగా పుతోజు కృష్ణమాచారి నియామితులయ్యారు. సీతాఫల్‌మండి శ్రీనివాసనగర్‌లోని కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్ పాల్గొని సికింద్రాబాద్ అధ్యక్షుడితో పాటు ఐదు డివిజన్ల అధ్యక్షులను, నూతన కమిటీ సభ్యులను నియమించారు. అధ్యక్షుడిగా పుతోజు కృష్ణమాచారి, ప్రధాన కార్యదర్శి వడ్ల శివకుమార్, కోశాధికారి వడ్ల భూమేష్‌చారి, ఉపాధ్యక్షులుగా దేవరకొండ రాములుచారి, వంగాల భిక్షపతిని నియమించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను మదన్‌మోహన్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాళ్లబండి విష్ణుచారి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు పబ్బోజు భిక్షపతిచారి, యాదగిరి పాల్గొన్నారు.

టెన్నిస్ డబుల్స్ విజేత శ్రీమాన్య జోడీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఏటీపీ టెన్నిస్ టోర్నమెంట్ డబుల్స్‌లో హైదరాబాద్ అమ్మాయి ఎ.శ్రీమాన్య రెడ్డి జోడీ టైటిల్ సొంతం చేసుకుంది. బుధవారం ముంబైలో జరిగిన డబుల్స్ ఫైనల్లో శ్రీమాన్య డాన్సియా ఫెర్నాండో (ముంబై) జంట 7-5, 6-3తో సంజన సిరిమల్ల-ఒమ్నా యాదవ్ (తెలంగాణ) జోడీపై గెలిచి ట్రోఫీ దక్కించుకుంది. సింగిల్స్ సెమీస్‌లో శ్రీమాన్య 6-0, 6-0తో జియా పెరీరా (ముంబై)పై నెగ్గి ఫైనల్లోకి ప్రవేశించింది.



విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న సిలిండర్ల లారీ

● తప్పిన పెనుప్రమాదం

బోయినపల్లి, మార్చి13(ఆంధ్రజ్యోతి): బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లికార్జున్ కాలనీలో గురువారం పెనుప్రమాదం తప్పింది. గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న లారీ.. డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. పెద్దగా నిప్పు రవ్వలు రావడంతో పాటు విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. కరెంట్ షాక్ కొడుతుందన్న భయంతో డ్రైవర్ లారీ నుంచి దూకి దూరంగా వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న విద్యుత్ అధికారులు కరెంట్ సరఫరాను నిలిపేశారు. అయితే, అదే సమయంలో స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, గ్యాస్ సిలిండర్ల గోదాం ఇళ్ల మధ్య ఉందని, దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనకు గురవుతున్నామని,అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. లారీ డ్రైవర్‌పై విద్యుత్‌శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


ప్రమాద స్థలంలో లారీ

చిలకలగూడలో యువతి అదృశ్యం

బౌద్ధనగర్, మార్చి13(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ జ్ఞానేశ్వర్ కథనం ప్రకారం.. చిలకలగూడకు చెందిన డి.కావేరి(21) నగరంలోని ఓ మార్ట్‌లో క్యాషియర్‌గా పని చేస్తోంది. బుధవారం సాయంత్రం ఐదున్నర గంటల సమయంలో ఫోన్‌ను ఇంట్లో చార్జింగ్ పెట్టిన కావేరి ఆఫీస్‌కు వెళ్తున్నానని ఇంట్లో వారికి చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. ఆమె కోసం పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో తన కుమార్తె కనిపించడం లేదని తల్లి యాదమ్మ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కావేరి

నిర్వహణ లేక అధ్వానంగా...

- వెలగని విద్యుత్ దీపాలు
- తిరగని ఫ్యాన్లు
- తాగునీటి కోసం తిప్పలు
- అపరిశుభ్రతో నిండిన పరిసరాలు
- బన్సీలాల్‌పేటలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ పరిస్థితి ఇదీ


పాడైపోయిన సీలింగ్


బన్సీలాల్‌పేటలోని జీహెచ్‌ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్

పద్మారావునగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి ప్రజలు శుభకార్యాలు నిర్వహించుకొనేందుకు కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన జీహెచ్‌ఎంసీ మల్టీపర్పస్ హాళ్ల నిర్వహణ కరువై అధ్వానంగా తయారు కావడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. బన్సీలాల్‌పేట డివిజన్ బీజేఆర్ నగర్‌లో గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో నిర్మించిన మొట్ట మొదటి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ దుస్థితే ఇందుకు నిదర్శనం.

- బన్సీలాల్‌పేటలో 2017లో దాదాపు రూ. 2.6 కోట్ల వ్యయంతో ప్రభుత్వం మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను నిర్మించింది. అప్పటి రాష్ట్ర మంత్రులు కె.తారక రామారావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ డివిజన్ కార్పొరేటర్ కుర్మ హేమలతతో కలిసి ఈ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించారు.
- జీహెచ్‌ఎంసీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కింది స్థాయి సిబ్బంది హాల్ నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో ఫంక్షన్ హాల్ అపరిశుభ్రతకు నిలయంగా మారింది. విద్యుత్ లైట్లు వెలగక, ఫ్యాన్లు తిరగక, తాగునీరు సౌకర్యం లేక ఇక్కడ శుభకార్యాలయాలు నిర్వహించుకొనే వారు ఇబ్బందులు పడుతున్నారు.
- హాల్ అద్దె తక్కువైనప్పటికీ టెంట్‌హౌస్ సామగ్రి, తాగునీరు, డెకరేషన్, లేబర్ వంటి అదనపు ఖర్చులు ఎక్కువ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లను ఆశ్రయించాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు.

మూలనపడ్డ తాగు నీటి శుద్ధి కేంద్రం

కవాడిగూడలోని ఎన్‌టీపీసీ దక్షిణ ప్రాంత కేంద్ర ప్రధాన కార్యాలయం ఆధ్వర్యంలో సీఎస్‌ఆర్ కార్యక్రమం కింద లక్షల రూపాయల వ్యయంతో రోజుకు రెండు వేల లీటర్ల సామర్థ్యం కలిగిన తాగునీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే, విద్యుత్ బకాయిలు చెల్లించపోవడంతో పాటు నిర్వహణ కరువై ఈ తాగునీటి శుద్ధి కేంద్రం మూలన పడింది.

తొలగింపునకు నోచుకోని నిర్మాణ వ్యర్థాలు

నిర్వహణ, ఇతరత్రా అవసరాల నిమిత్తం ఫంక్షన్ హాల్ ఆవరణలో గతంలో ఒక కార్యాలయాన్ని నిర్మించారు. స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పార్టీ కార్యకలాపాలకు, వ్యక్తిగత అవసరాలకు దానిని వినియోగిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ కార్యాలయాన్ని అధికారులు కూల్చివేయించారు. అయితే, భవన నిర్మాణ వ్యర్థాలను ఇప్పటి వరకు తొలగించక పోవటంతో శుభాకార్యాలయాలు నిర్వహించుకొనేందుకు వచ్చే స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.


ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం


స్టోర్ రూమ్‌లా మారిన రెస్ట్‌రూమ్

ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు బన్సీలాల్‌పేట జీహెచ్‌ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో అన్ని సౌకర్యాలను కల్పించి నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో అతుక్కల్ పొంగలా



చిలకలగూడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కేరళ సంప్రదాయ పర్వదినం అతుక్కల్ పొంగలాను గురువారం మెట్టుగూడ అయ్యప్ప ఆలయంలో మళయాలీ మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించిన సుమారు వంద మంది మహిళలు ఉదయాన్నే ఆలయానికి చేరుకున్నారు. అందమైన ముగ్గులు వేసి, ఇటుకలతో ఏర్పాటు చేసిన కట్టెల పొయ్యిలను వెలిగించి భక్తి గీతాలు పాడుతూ ప్రసాదం వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు. ఆలయ ప్రతినిధి సునీల్ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాటు చేశారు.


కట్టెల పొయ్యిలపై సామూహికంగా ప్రసాదం తయారు చేస్తున్న మహిళలు

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

●చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏసీపీ జైపాల్‌రెడ్డి

బౌద్ధనగర్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిలకలగూడ డివిజన్ ఏసీపీ జైపాల్‌రెడ్డి సూచించారు. మధురానగర్ కమ్యూనిటీహాల్‌లో మధురానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్, లష్కర్‌జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఏసీపీ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ, ఇటీవల సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, సైబర్ నేరాలను అరికట్టడానికి పోలీసులు అనేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రకటనలు, అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తున్న ఎక్కడో ఒకచోట ప్రజలు సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్నారన్నారు. ఒంటరిగా ఉన్న సీనియర్ సిటిజన్స్‌ను సైబర్ నేరగాళ్లు ఎక్కువగా టార్గెట్ చేస్తున్నారన్నారు. సెల్‌ఫోన్‌ల్లో వచ్చే మెస్సేజ్‌లు, లింకులను ఓపెన్ చేయొద్దని, ఎలాంటి ఓటీపీ నెంబర్లు చెప్పొద్దన్నారు. విద్యావంతులు, వివిధ హోదాల్లో పని చేస్తున్న వారు ఎక్కువ సైబర్ నేరగాళ్ల వలలో పడుతున్నారన్నారు. మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు పోలీసే శాఖ తగిన చర్యలు తీసుకుంటోందని, పిల్లలు, యువకులు గంజాయి బారిన పడకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

1930కి ఫోన్ చేయాలి..

అనంతరం చిలకలగూడ డీఐ, వారాసిగూడ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్ మాట్లాడుతూ, ఎవ్వరైన సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే నం. 1930కి ఫోన్ చేసి వివరాలు చెపితే వెంటనే సైబర్ నేరగాళ్ల బ్యాంక్ ఖాతాను బ్లాక్ చేస్తారని తెలిపారు.కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బ్రహ్మాచారి, ప్రధాన కార్యదర్శి రాజుసాగర్, సభ్యులు శ్రీధర్, మహేష్, ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ సంజీవ రెడ్డి, రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫెడరేషన్ సభ్యురాలు శ్రీలత, విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం అధ్యక్షుడు అశోక్‌చారి తదితరులు పాల్గొన్నారు.

షాపుల వద్ద హోలీ సందడి

తిరుమలగిరి మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రంగుల కేళి.. హోలీ పండుగను ఘనంగా జరుపుకునేందుకు లష్కర్ వాసులు సన్నద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో తిరుమలగిరి, బొల్లారం తదితర ప్రాంతాల్లో హోలీ సంబురాల్లో వినియోగించే పలు రంగులు, రంగు నీళ్లను పిచికారీ చేసే పరికరాలతో పాటు పంచదార చిలుకలను షాపుల్లో విక్రయానికి ఉంచారు. వీని కొనుగోలు చేసేందుకు వస్తున్న చిన్నా.. పెద్దలతో షాపుల పరిసరాల్లో సందడి నెలకొంది.


షాపుల వద్ద విక్రయానికి ఉంచిన హోలీ రంగులు, పంచదార చిలుకలు

మాదిగలకు న్యాయం చేయడం రేవంత్‌రెడ్డి బాధ్యత

బౌద్ధనగర్, మార్చి13(ఆంధ్రజ్యోతి): మాదిగలకు న్యాయం చేయడం రేవంత్‌రెడ్డి నైతిక బాధ్యతని, ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని త్వరగా తీసుకురావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్‌మాదిగ డిమాండ్ చేశారు. గురువారం సీతాఫల్‌మండి అంబేడ్కర్ విగ్రహం వద్ద మాదిగ సోషలిస్ట్ పార్టీ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి డప్పు మల్లికార్జున్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, మాదిగల వల్ల రేవంత్‌రెడ్డికి లాభం జరిగింది తప్ప, ఆయన వల్ల మాదిగలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ లేకుండానే పదకొండు వేల టీచర్ల పోస్టులను భర్తీచేసి రేవంత్ ప్రభుత్వం మాదిగలకు అన్యాయం చేసిందన్నారు. ఇప్పుడు వర్గీకరణ చట్టం తీసుకురాకముందే గ్రూపు1, 2, 3తో పాటు హాస్టల్ ఆఫీసర్ మొదలగు పరీక్ష ఫలితాలు విడుదల చేసి అన్యాయం చేసిందన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్రా భిక్షపతి మాదిగ, నాయకులు నందారం సీతారాం మాదిగ, తుమ్మల శివప్రసాద్, చాగంటి యాదగిరి, విజయకుమార్, సురారం సుజాత తదితరులు పాల్గొన్నారు.


సీతాఫల్‌మండిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


పౌష్టికాహారం అందజేస్తున్న టీబీ యూనిట్ బృందం

టీబీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ

అడ్డగుట్ట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తుకారాంగేట్‌లోని రైల్వే ఆస్పత్రిలో గురువారం లాలాపేట టీబీ యూనిట్ ఆధ్వర్యంలో టీబీ బాధితులకు మెరుగైన వైద్య సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టీబీ రోగులకు పౌష్టికాహారం ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ రాజు, యూనిట్ సభ్యులు శాంతి, సంజీవిని, సుబ్బారావు, ఆనందవల్లి, భరత్ పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా యూత్‌కాంగ్రెస్ ఇన్‌చార్జిగా అరవింద్



తిరుమలగిరి మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా జి.అరవింద్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి గురువారం గాంధీ భవన్‌లో అతడికి నియామక పత్రాన్ని అందజేశారు. కాగా, ఈయన ప్రస్తుతం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా అరవింద్ బొల్లారంలోని తన కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి' తో మాట్లాడారు. తనను రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా నియమించినందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జక్కిడి శివచరణ్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర టీపీసీసీ కార్యదర్శి నరసింహన్ కన్నన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జీవీ బాల్‌రాజ్, ఎన్ఎస్‌యూఐ నాయకులు రషీద్ పాల్గొన్నారు.

'సెంట్రల్ వర్సిటీ భూములను విక్రయించొద్దు'

తార్నాక, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : గచ్చిబౌలిలోని సెంట్రల్ యూనివర్సిటీ భూముల విక్రయ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్ డిమాండ్ చేశారు. తార్నాకలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, గచ్చిబౌలిలోని సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన సుమారు 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ ఏజెంట్లకు అమ్మి సొమ్ము చేసుకోవడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. విద్యార్థులకు భవిష్యత్‌లో నూతన హాస్టళ్లు, పరిశోధనా కేంద్రాలు ఏర్పాటు చేయడానికి వీలుగా ఉన్న భూములను అమ్మకానికి పెట్టడం అంటే విశ్వవిద్యాలయాలను ప్రభుత్వం కనుమరుగు చేసే కుట్రలో భాగమేనని విమర్శించారు. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని వర్సిటీ భూముల విక్రయాలను విరమించుకోవాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని విజయ్ హెచ్చరించారు.


కానిస్టేబుల్ చిత్రంలోని పాటను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే తలసాని తదితరులు

చిన్న చిత్రాలను కూడా ఆదరించాలి

●ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చిన్న చిత్రాలను కూడా ప్రేక్షకులు ఆదరించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం వెస్ట్ మారేడుపల్లిలోని తన కార్యాలయంలో జాగృతి మూవీ మేకర్స్ బ్యానర్‌పై వరుణ్ సందేశ్, మధులిక జంటగా ఆర్యన్ సుభాన్ దర్శకత్వంలో నిర్మించిన కానిస్టేబుల్ చిత్రంలోని 'మేఘం కురిసింది'.. అనే పాటను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.... శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖలో కానిస్టేబుల్‌కు ఎదురయ్యే ఇబ్బందులు, కుటుంబ నేపథ్యం, సస్పెన్స్, థ్రిల్లర్‌తో నిర్మించిన ఈ చిత్రం ప్రేక్షకుల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. సినీ పరిశ్రమలో తాము కూడా రాణించాలనే లక్ష్యంతో కొత్త నటీనటులు వస్తున్నారని, వారిని కూడా ప్రోత్సహించాలని కోరారు. సందేశాత్మక చిత్రాలను తెలుగు ప్రజలు ఎప్పుడూ ఆదరిస్తారని తలసాని అన్నారు. కార్యక్రమంలో పవన్ కుమార్ గౌడ్, చిత్ర హీరో వరుణ్ సందేశ్, హీరోయిన్ మధులిక, డైరెక్టర్ ఆర్యన్ సుభాన్, నిర్మాత బలగం జగదీష్, బీఆర్ఎస్ నాయకులు జగ్గయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.